క్లుప్తంగా

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన చేసుకోవాలి


నగరం పోలీస్ స్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్

మామిడికుదురు: దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు, శిక్షలు అమల్లోకి వచ్చాయని వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నగరం ఎస్సై పి.సురేష్ సూచించారు. నగరం పోలీస్ స్టేషన్‌లో కొత్త చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పెళ్లి చేసుకుంటానని లైంగిక దోపిడీకి పాల్పడితే పదేళ్ల జైలు శిక్ష విధిస్తారని చెప్పారు. గతంలో ఉండే ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ)ల స్థానే భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ చట్టాలను అమల్లోకి తీసుకు వచ్చారన్నారు. కొత్త చట్టాలతో భారత న్యాయ వ్యవస్థ, నేర విచారణ విధానాల్లో కొత్త మార్పులు వస్తాయన్నారు. జీరో ఎఫ్ఐఆర్, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడం, ఎలక్ట్రానిక్ మోడ్‌లో సమన్ల జారీ వంటి మార్పులకు అవకాశం ఏర్పడుతుందన్నారు. పోలీస్ స్టేషన్‌తో సంబంధం లేకుండా ఏ స్టేషన్‌లో అయినా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకునే వెసులుబాటు ఉందని ఎస్సై సురేష్ తెలిపారు. వీటిపై అవగాహన చేసుకోవాలని సూచించారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సత్కారం


కొత్తపేటలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పెద్దిరాజు

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడం కళాశాలకు ఎంతో గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు అన్నారు. కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ (సీయూకే)లో ఎంఎస్సీ కెమిస్ట్రీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో గనిశెట్టి రామకృష్ణమోహన్‌శంకర్ 6వ ర్యాంకు, కొల్లాటి జాయసి 7వ ర్యాంకు సాధించారు. అక్కడ చేరేందుకు వెళుతున్న సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో పుష్పగుచ్ఛాలు, మెమెంటోలతో అభినందించారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, కెమిస్ట్రీ అధ్యాపకులు జి.శ్రీనివాసులు, పి.సాయికృష్ణ, ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు పాల్గొన్నారు.

ఎనిమిది అవార్డులు సొంతం చేసుకున్న మలికిపురం రోటరీ


విజయవాడలో అవార్డులు అందుకుంటున్న మలికిపురం క్లబ్ ప్రతినిధులు

మలికిపురం: మానవ సేవా దృక్పథంతో అంతర్జాతీయ రోటరీ సేవా కార్యక్రమంలో భాగంగా మలికిపురం రోటరీ క్లబ్ 2023–24 సంవత్సరానికి గాను ఎనిమిది అవార్డులు సొంతం చేసుకున్నట్టు రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్ సోమవారం చెప్పారు. సేవా కార్యక్రమాల్లో తన వంతు బాధ్యత వహించి, పబ్లిక్ ఇమేజ్ కమ్యూనిటీ సర్వీస్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలపై పై అవార్డులు వచ్చాయన్నారు. ఇందులో ఒకటి ప్లాటినం, ఒకటి గోల్డ్, ఆరు సిల్వర్ అవార్డులను సొంతం చేసుకున్నారు. వీటిని విజయవాడలో జరిగిన రోటరీ అంతర్జాతీయ అవార్డ్ నైట్‌లో, రోటరీ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు చేతుల మీదుగా క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి మురళీకృష్ణ, కార్యదర్శి బందెల సంపత్ అందుకున్నారన్నారు.

పూడికతో పరేషాన్


అలమూరులో గుర్రపుడెక్కతో పూడుకుపోయిన పంట కాలువ


చింతలూరులోని పంట కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

- కాలువలు ఇలా.. నీరు పారేదెలా?
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- శివారు ప్రాంతాలకు చేరని సాగునీరు

అలమూరు: ఇరిగేషన్ శాఖ అలసత్వం, అధికారుల మధ్య సమన్వయ లోపంతో పంట కాలువల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సుమారు 28 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా శివారు ప్రాంతాలకు సాగునీరు సకాలంలో అందడం ప్రశ్నార్థకంగా మారింది. ఇరిగేషన్ శాఖ పంట కాలువల దుస్థితిని అంతగా పట్టించుకోకపోవడంతో ఖరీఫ్ సాగు పనులు మరింత జాప్యమయ్యే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే నారుమళ్లు ప్రారంభమైనా సాగు నీరు సక్రమంగా అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి మధ్య డెల్టా, తూర్పు డెల్టా నుంచి సాగునీరు పంట కాలువల్లోకి వెళుతున్న సమయంలో వ్యర్థాలు, గుర్రపు డెక్క అడ్డుపడి సాగునీరు పారుదల ఇబ్బందికరంగా మారుతుంది. మూడేళ్ల క్రితం కాలువల ఆధునీకరణలో భాగంగా దాదాపు మండలంలోని అన్ని పంటకాలువల్లో పూడిక తీయించారు.

అయితే ప్యాకేజీలో భాగంగా చేపట్టిన ఈ పనులు తరువాత పర్యవేక్షణ లేకపోవడంతో పంట కాలువలు మళ్లీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో పంటకాలువలు ఎక్కడికక్కడే పూడికతో నిండి చిట్టడవిని తలపిస్తున్నాయి. గతంలో మాదిరిగా ఎన్ఆర్‌జీఈఎస్ నిధులతో మరమ్మత్తులు చేయించే వీలు లేనందున రైతులు ఇరిగేషన్ శాఖ మీదనే ఆధారపడవలసిన దుస్థితి ఏర్పడింది. ఆలమూరులోని స్థానిక అగ్నికుల క్షత్రియుల పేట నుంచి సంధిపూడి వరకూ, నర్శిపూడి నుంచి గుమ్మిలేరు వరకూ పంటకాలువలో గుర్రపుడెక్క, చెత్త, చెదారంతో నిండిపోయింది. దీనివల్ల ఈ నీటిని పశువులకు కూడా వినియోగించలేని పరిస్థితి నెలకొంది. కొంతమంది బోర్ల సాయంతో నారుమళ్లు వేసినా శివారు ప్రాంతాల్లోని రైతులకు నీటి ఎద్దడి రావడంతో వరినాట్లు ఇప్పట్లో వేసుకునే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. దీనిపై ఇరిగేషన్ దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కన్పించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువలో వ్యర్థాలు

మండలంలోని వివిధ గ్రామాల వెంబడి ఉన్న పంటకాలువల్లో స్థానికులు వ్యర్థాలు పడవేయడంతో కాలువ మురుగు కాలువను తలపిస్తుంది. పశువులు కూడా నీరు తాగలేని మాట అటుంచి నీటిలో శుభ్రపరచుకునే పరిస్థితి కూడా లేదని పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు మురుగు కాలువను, పంట కాలువను వేర్వేరుగా నిర్మించాలని వారు కోరుతున్నారు. కాలువను ఆధునీకరించకుంటే అధిక వర్షాలు కురిసే సమయంలో నీరు కూడా బయటకు వెళ్లే అవకాశం ఉండదని రైతులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి కాలువలకు మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను విజయవంతం చేయాలి


చొప్పెల్ల పీహెచ్‌సీలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

అలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పి డెంగీ వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున, డి.సాయికిషోర్ కోరారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా పీహెచ్‌సీలతో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో సోమవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈనెల ఒకటి నుంచి 31 వరకూ నిర్వహించే డెంగీ వ్యాధి వ్యతిరేక మాసోత్సవాల ఆవశ్యకతను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుంది


మామిడికుదురులో వికలాంగుడికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మామిడికుదురు: కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మామిడికుదురులో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. పలువురు వికలాంగులు, వితంతువులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందన్నారు. దశల వారీగా హామీలను అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. మొదటి హామీ పింఛన్ సహాయాన్ని పెంచడం అమలు చేయడం జరిగిందన్నారు. పారదర్శకమైన పాలన అందించే దిశగా ముందుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, కూటమి నేతలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి నూతన కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని మోరిపోడు, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక గ్రామాలలో ప్రభుత్వం పెంచిన పింఛన్లను పంపిణీకి శ్రీకారం చుట్టారు.

మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి, కూటమి నాయకులు పాల్గొన్నారు. అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం గ్రామాల్లో పర్యవేక్షణాధికారి, ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్ పింఛన్లు పంపిణీని పర్యవేక్షించారు. కేశవదాసుపాలెంలో పింఛన్లు పంపిణీని ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, ఏపీవో నాగప్రసాద్, డీటీ సీహెచ్ భాస్కర్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వి.రామరాజు పర్యవేక్షించారు.

పేదల సంక్షేమమే లక్ష్యం


నగరంలో లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు: పేదలకు సంక్షేమ పథకాలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. నగరం గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే సత్యనారాయణ లబ్ధిదారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ ఇచ్చిన మాటకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ల ద్వారా అందించే ఆర్థిక సహాయాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా గణనీయంగా పెంచడం జరిగిందన్నారు. తద్వారా పేదలకు ఎంతో అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ పంపిణీ చేస్తామని ఎవరూ అధైర్యపడొద్దని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మాచవరంలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండలంలో 9383 పింఛన్లు ఉన్నాయని ఎంపీడీఓ వి.సరోవర్ ఎమ్మెల్యేకు వివరించారు. పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్ పంపిణీ చేశారు. సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి, గణపతి వీరరాఘవులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి, తొత్తరమూడి, శానపల్లిలంక తదితర గ్రామాల్లో ఫించన్ల పంపిణీలో పాల్గొని నేరుగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పింఛన్లు పంపిణీ చేశారు. తొలుత ఆయన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. కొండుకుదురులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన 'నేను బడికిపోతా' కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి, కూటమి నాయకులు ఉన్నారు.

పి.గన్నవరం: స్థానిక హైస్కూల్ రోడ్‌లో సోమవారం ఉదయం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సత్యనారాయణ ప్రారంభించారు. ఎంపీడీఓ త్రిశూలపాణి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తపేట: అధికారం చేపట్టిన వెంటనే సామాజిక పింఛను పెంచుతామని ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నుంచి పెంచిన సొమ్ముతో పాటు ఈ నెల పింఛన్ కూడా కలిపి పంపిణీ చేయడం ద్వారా లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు. మండలంలోని వాడపాలెం, కొత్తపేట శివారు శ్రీనివాసపేట గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం కలసి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలోఎంపీడీవో కె.వాణి, గ్రామ కార్యదర్శి వీవీ రామన్, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఎంపీటీసీ పల్లి శాంతి పాల్గొన్నారు.

రావులపాలెం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా సోమవారం రావులపాలెం జరిగిన కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రూ.7 వేలు పింఛన్‌ను అందజేశారు. మండలంలో 12,026 పెన్షన్లకు గాను రూ.8 కోట్ల మూడు లక్షలు మంజూరు కాగా సోమవారం సాయంత్రానికి 95 శాతం పంపిణీ పూర్తి చేసినట్టు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీను, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో సోమవారం చేపట్టిన పింఛన్ల పంపిణీ 94 శాతం పూర్తయ్యింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక తొలి పంపిణీ కార్యక్రమంలో కావడంతో కూటమి నాయకులందరూ పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. మండలంలోని 18 గ్రామాల పరిధిలోని 24 గ్రామ సచివాలయాలు ఉండగా 11,172 మంది పింఛన్‌దారులు ఉండగా పెరిగిన పింఛన్ల దృష్ట్యా రూ 7.45 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. అందులో భాగంగా గ్రామ సచివాలయ సిబ్బంది తొలిరోజు 10,506 మందికి రూ.6.99 కోట్లు పంపిణీ చేశారు.

వైద్యులు ప్రాణదాతలు


కొత్తపేటలో డాక్టర్ శేషుబాబును సత్కరిస్తున్న రాష్ట్ర యువమోర్చా నేత జేపీ

అంబాజీపేట: వైద్యులు ప్రాణదాతలు వారి సేవలు ఎనలేనివని జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల బాబూరావు అన్నారు. అంబాజీపేటలో ఆర్ఎంపీ, పీఎంపీల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ స్వగృహం వద్ద నేషనల్ డాక్టర్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్స్ డే సందర్భంగా కేకు కట్ చేసి పలువురికి పంచారు. ఎం.లక్ష్మణరావు, డి.నాగేశ్వరరావు, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వక్కలంక పంచాయతీ కార్యాలయంలో డాక్టర్స్ డే సందర్భంగా సర్పంచ్ వాసంశెట్టి రేవతి, నాయకులు వాసంశెట్టి పెదబాబు, యనమదల రాజబాబు తదితరుల ఆధ్వర్యంలో ముక్కామల పీహెచ్‌సీ వైద్యురాలు జీవీ గీతాంజలిని ఘనంగా సత్కరించారు.

వైద్యులే ప్రత్యక్ష దైవాలు

కొత్తపేట: వైద్య వృత్తి దైవంతో సమానమని, వైద్యులు ప్రత్యక్ష దైవాలని రాష్ట్ర బీజేపీ యువమోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్‌నారాయణ (జేపీ) అన్నారు. సోమవారం 'జాతీయ వైద్యుల దినోత్సవం' సందర్భంగా రాష్ట్ర యువమోర్చా నేత జేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు స్థానికంగా సేవా దృక్పథంతో వైద్య సేవలందిస్తున్న శ్రవణా నర్సింగ్ హోం అధినేత డాక్టర్ కాశిన గేయానంద శేషుబాబును ఘనంగా సత్కరించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శేషుబాబును డాక్టర్ డే సందర్భంగా సన్మానించుకోవడం సముచితమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: వైద్యుడ్ని దేవుడితో సమానంగా కొలుస్తారని ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నేదునూరులో సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ అధ్యక్షతన అంతార్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.మంగాదేవిని వారు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోళ్లపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: డాక్టర్స్ డే సందర్భంగా రాజోలు ఆర్యవైశ్య సంఘాల తరఫున సోమవారం వైద్యులకు కాసు శ్రీనివాస్, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కాసు భవానిలు శాలువాలతో సత్కరించారు. వైద్యులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ డాక్టర్స్ డే నిర్వహించారు. డాక్టర్లను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి బాబు, స్టాఫ్, రోటరీ క్లబ్ సభ్యులు సత్కరించారు.

ఘనంగా మహా సౌర యాగం

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రుపాలెంలో రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో రుద్ర, శత చండీ, మహా సౌరయాగాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలో గణపతి పూజ, గవ్యాంతం, మహాన్యాసం, రుద్రాభిషేకం, శత సహస్ర బిల్వార్చన, సూర్యనమస్కారాలు, చండీ పారాయణ, చండీ హోమం, రుద్ర హోమం జరిపారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేదాగమ పండితులు కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ, కాళ్లకూరి కామేశ్వర శర్మ, వెలవల్లి చంద్రశేఖర్ శర్మల ఆధ్వర్యంలో 12 రోజుల పాటు యాగం నిర్వహించనున్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం


పెదపళ్ల హోమియో శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఫార్మసిస్టు

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు జరిగింది. రాయవరం మండలంలోని లొల్లకు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ అల్లూరి శ్రీనివాస చౌదరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. వైద్యాధికారి కె.సత్యభవాని, ఫార్మాసిస్టు జి.సుబ్బలక్ష్మి విచ్చేసి సుమారు 120 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆలమూరు మండలానికి సంబంధించి ప్రతి నెలా మొదటి సోమవారం ఉచిత హోమియో క్యాంపును పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నామని ట్రస్టు తెలిపింది.

94 మందికి వైద్య సేవలు


అయినవిల్లిలంకలో రోగులకు సేవలు అందిస్తున్న 104 వైద్య సిబ్బంది


అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి పీహెచ్‌సీ పరిధిలో అయినవిల్లిలంక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం రోగులకు 104 సేవలు అందించారు. ఎంఎల్‌హెచ్‌ఎం జిల్లెల్ల మిలి ఆధ్వర్యంలో 94 మందికి వైద్య సేవలందించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగుల్లో ఎక్కువ మంది బీపీ, సుగర్, జనరల్ వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

ఉచిత సుగర్ మెగా క్యాంపు ఏర్పాటు


ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్‌బాబు

మలికిపురం: స్థానిక విజయ హాస్పిటల్‌లో రోగులు సౌకర్యార్థం హాస్పిటల్ అధినేత, రాజోలు జనసేన నాయకుడు డాక్టర్ ఆర్.రమేష్‌బాబు ఉచిత సుగర్ మెగా క్యాంపు ఏర్పాటు చేయడం హర్షణీయమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రశంసించారు. సోమవారం హాస్పిటల్‌లో పై క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేకు క్యాంపులో డాక్టర్ రమేష్ బాబు వైద్య పరీక్షలు చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలంలోని విశ్వేశ్వరాయపురం, రామరాజులంక గ్రామాల్లో అవ్వాతాతలకు, దివ్యాంగులకు ప్రభుత్వం పెంచిన పింఛన్లను ఎమ్మెల్యే వర ప్రసాద్ పంపిణీ చేశారు. లక్కవరం పీహెచ్‌సీ వద్ద వైద్యులు ఏర్పాటు చేసిన డయేరియా నియంత్రణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వరప్రసాద్ ప్రారంభించారు. సోమవారం నుంచి వచ్చే నెల 31 వరకూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రధానంగా 0–5 సంవత్సరాల లోపు పిల్లల్లో డయేరియా కారణంగా తలెత్తే మరణాలు నివారించడమే ముఖ్య ఉద్దేశ్యంగా వైద్యశాఖ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

సహజ కవి వెంకట్‌కు సన్మానం


సహజ కవి వెంకట్‌ను సన్మానిస్తున్న ప్రతాప్

అంబాజీపేట: గత నెల 30వ తేదీన సూర్యాపేట సాయి బాలాజీ ఫంక్షన్ హాల్లో జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో స్థానిక సహజ కవి పొలమూరి వెంకట్‌ను ఘనంగా సత్కరించారు. కవి సమ్మేళనంలో వెంకట్ తన ప్రతిభతో అందరిని ఆకట్టుకుని అందరి మన్ననలు పొందాడు. ప్రముఖ కవులు, రచయితలు, కళాకారుల సమక్షంలో కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ప్రముఖ తెలంగాణ కవి డాక్టర్ నాళేశ్వరం తదితరులు వెంకట్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరి భూషణం, చిట్టే లలిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌కు సన్మానం

సఖినేటిపల్లి: సాహిత్య కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సాహిత్య రంగానికి మరింత మంచి గుర్తింపును శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెచ్చారని తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ మెంబర్ నాళేశ్వరం శంకరం అన్నారు. ఆదివారం తెలంగాణ లోని సూర్యాపేటలో ప్రతాప్ ఆధ్వర్యంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. వివరాలు సోమవారం ఆయన తెలిపారు. ప్రతాప్‌ను సూర్యాపేట జిల్లా కవులు సత్కరించి, గండపెండేరం తొడిగారు. సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడం ప్రతాప్‌కే సాధ్యమని వారు పేర్కొన్నారు. సాహిత్యవేత్తలు పి.వీరాచారి, పి.పద్మ, ఎస్.జ్యోతి, గణేష్ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డయేరియాపై తగిన జాగ్రత్తలు పాటించాలి

మామిడికుదురు: అతిసార నివారణకు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత సూచించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరం పీహెచ్‌సీ వద్ద అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. అయిదేళ్లలోపు చిన్నారులు అతిసార బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ జాలెం రమణకుమారి సూచించారు. భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలని డాక్టర్ స్వర్ణలత పేర్కొన్నారు. స్వచ్ఛమైన తాగునీరు తాగాలని, వేడి ఆహారం భుజించాలని, బహిరంగ మల, మూత్ర విసర్జన చేయరాదన్నారు. టాయిలెట్ ఉపయోగించిన ప్రతిసారి చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈదరాడ పంచాయతీ వద్ద కూడా స్టాప్ డయేరియా కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో కార్యదర్శి పీవీఆర్‌కే రాజు, పలు రాజకీయ పార్టీల నేతలు, పీహెచ్‌సీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబాజీపేట: వర్షాలు మొదలైనందున డయేరియా వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో డయేరియా మాసోత్సవాల కార్యక్రమాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారులు నిర్వహిస్తారన్నారు. అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో ఓఆర్ఎస్, మందులు వంటివి అందుబాటులో ఉంచాలన్నారు.

పి.గన్నవరం: డయేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.గన్నవరం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి సూచించారు. నాగుల్లంక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం స్టాప్ డయేరియా కార్యక్రమం జరిగింది. డయేరియాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ జరిగింది. ఐదేళ్లలోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని వైద్యాధికారులు వై.ప్రియాంక, ఎం.మౌనికమణి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, ఎంపీటీసీ పాలూరి వీరభద్రరావు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అయినవిల్లి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని నేదునూరు జెడ్పీ పాఠశాలలో వైద్యాధికారి బి.మంగాదేవి ఆధ్వర్యంలో సోమవారం స్టాప్ డయేరియా మాసోత్సవం నిర్వహించారు. సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి బి.మంగాదేవి మాట్లాడుతూ నీళ్ల విరేచనాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని ముందస్తు జాగ్రత్తతో అరికట్టాలని అన్ని పీహెచ్‌సీ సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, హెల్త్ సూపర్ వైజర్ ప్రసాదరావు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: డయేరియా వ్యాధి నియంత్రణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. సోమవారం సఖినేటిపల్లి పీహెచ్‌సీ వద్ద సోమవారం నుంచి వచ్చే నెలాఖరు వరకూ నిర్వహించే డయేరియా నియంత్రణ షెడ్యూల్‌పై ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. గ్రామాల్లో హెల్త్, వెల్నెస్ కేంద్రాల్లోను, అంగన్‌వాడీ కేంద్రాల్లోను, పాఠశాలల్లోను ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుతామన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ రాపాక దీవెన కుమారి, సీహెచ్‌వో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, సూపర్‌వైజర్లు పీఎల్ఎస్ స్వామి, పాల్గొన్నారు.

రావులపాలెం: ప్రస్తుత సీజన్‌లో ప్రజలు అతిసార (డయేరియా) వ్యాధిపై అవగాహనతో మెలగడంతో డయేరియా బారిన పడకుండా కాపాడుకోవచ్చని వైద్యాధికారులు సూచించారు. డయేరియాపై అవగాహనలో భాగంగా సోమవారం రావులపాలెంలో నిర్వహించిన కార్యక్రమాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అతిసార వ్యాధి ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అతిసార వ్యాధిపై ఈనెల ఒకటో తేదీ నుంచి ఆగష్టు 31 తేదీ వరకూ అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి అతిసార వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పిస్తారని వైద్యాధికారులు తెలిపారు.

రాజోలు: డయేరియాను పూర్తి స్థాయిలో నివారించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించడం ఎంతో ఉపయోగమని ఎంపీపీ కేతా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం తాటిపాక పీహెచ్‌సీ పరిధిలోని పొదలాడ గ్రామంలో డయేరియా క్యాంపైన్ ఇంటింటా సర్వేను ఎంపీపీ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు.


రావులపాలెంలో డయేరియాపై అవగాహన ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు తదితరులు


నగరం పీహెచ్‌సీ వద్ద నిర్వహించిన స్టాప్ డయేరియా ర్యాలీ